క్లుప్తంగా

సహకార సొసైటీ చైర్మన్ రాజీనామా

పగిడ్యాల: స్థానిక వ్యవసాయ సహకార సొసైటీ పరపతి సంఘ చైర్మన్ పర్వతంరెడ్డి శ్రీనివాసరెడ్డి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. 2024 ఫిబ్రవరి 5వ తేదీన సొసైటీ చైర్మన్‌గా బాధత్యలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి తన హయాంలో నాబార్డు నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజన గోదాములు ప్రారంభించారు. అలాగే రైతులకు బంగారు రుణాలు ఇప్పించడానికి కృషి చేశారు. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. రాజీనామా లేఖను సొసైటీ సీఈఓ ఖాజాకు సమర్పించారు. చైర్మన్ ఇచ్చిన రాజీనామా లేఖను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని సీఈఓ తెలిపారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున

ఆత్మకూరు: పట్టణంలోని ప్రగతి స్కూల్‌లో నిర్మాణంలో ఉన్న భవనాలో తరగతులను నిర్వహించడం సరికాదని ఏఐఎస్‌ఏ (ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్) జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. శనివారం పట్టణంలో ఆయన ప్రగతి స్కూల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో బిల్డింగ్ పనులు జరుగుతుండగా తరగతులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారన్నారు. పైన పనులు చేస్తున్నారని, కింద నుంచి ఇసుక, సిమెంట్ బస్తాలు తీసుకెళ్లాల్సి ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రగతి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల దందాను అరికట్టాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నందికొట్కూరు: మండల పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ఇష్టానుసారంగా జరుగుతున్న దందాను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మద్రిస్వామి, పీఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దక్క కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ ఫైజున్నిసాబేగంకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారన్నారు. వారి పాఠశాలల పేరుతో పుస్తకాలు ముద్రించి, స్కూల్ యూనిఫాం, టై బిల్లు, ప్రైవేట్ నోటుబుక్స్‌లు అమ్మడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని జంతువధ నిషేధం

నంద్యాల(సిటీ): పట్టణంలో అనుమతులు లేని జంతు వధ నిషేధమని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై, ఇళ్ల వద్ద, అనుమతి లేని జంతు వధశాలల్లో మాంసం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు, పశు వైద్యులు ధృవీకరించిన జంతువులను మాత్రమే మాంసం కోసం వధించాలని సూచించారు. లైసెన్స్ పొందిన జంతు వధశాలల్లో మాత్రమే మాంసం విక్రయాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ కమిటీని శనివారం రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పరిశీలకులు సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్షేత్ర స్థాయి ప్రముఖ చంద్రశేఖర్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల సుధాకర్‌తో పాటు ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశాన్ని ఒలంపిక్స్‌లో ముందుంచాలనే లక్ష్యంతో క్రీడా భారతి ఆవిర్భవించిందన్నారు. నంద్యాల జిల్లాలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించారని, నూతనంగా ఎన్నికైన సుధాకర్ అన్నారు.

- భారీగా పెరిగిన చికెన్ ధరలు
- చుక్కలనంటుతున్న పొట్టేలు మాంసం రేటు
- నిరాశచెందుతున్న మాంసం ప్రియులు

కొండెక్కిన మాంసం ధరలు



ఆత్మకూరులోని మాంసం దుకాణం వద్ద కట్టేసిన మేకలు, పొట్టేళ్లు



ఓ చికెన్ దుకాణంలో కోసేందుకు సిద్ధంగా ఉంచిన కోళ్లు

ఆత్మకూరు: పట్టణంలో చికెన్ ధరలు కొండెక్కాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఊహించని విధంగా భారీగా పెరిగాయి. దీనికితోడు పొట్టేలు మాంసం ధరలు కూడా భారీగా ఉండటంతో మాసం ప్రియులు అర కేజీ, పావుకేజీతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. బక్రీద్ పండుగ ఉండటం, మరి కొద్ది రోజుల్లో మొహర్రం పండుగ రానుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

పక్క మండలాల్లో చికెన్ ధరలు తక్కువే..

గత నెలలో రూ.200 నుంచి రూ.240 ధర పలికిన చికెన్ ఈ నెల ప్రారంభం నుంచి రూ.260 నుంచి రూ.300 దాకా విక్రయిస్తున్నారు. ఊహించని విధంగా ధరలు పెరగడంతో మాంసం ప్రియులు నిరాశ వ్యక్తం చేశారు. వాస్తవానికి నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో చికెన్ విక్రయాలను పరిశీలిస్తే చాలా వరకు ధరలు తక్కువగానే ఉంటాయి. రూ.220 నుంచి రూ.240 దాకా ఉన్నాయి. కాగా, వారు నంద్యాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోవడంతో తక్కువ ధరకు దొరుకుతున్నాయని, ఆత్మకూరులోని దుకాణదారులు కర్నూలు నుంచి కోళ్ల కొనుగోలు చేయడంతో ఎక్కువ ధర పడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతే కాకుండా స్థానికంగా ఉండే ఇద్దరు బడా వ్యాపారులే పట్టణంలో ధరలను శాసిస్తున్నారని, వారు నిర్ణయించిన ధరకే ఇతరులు కూడా విక్రయించాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని చికెన్ ధరలు నియంత్రించాలని మాసం ప్రియులు కోరుతున్నారు.

మార్కెట్‌లో పొట్టేళ్ల ధరలు తగ్గినా..

పట్టణంలో ప్రతి శనివారం మేకలు, పొట్టేల అమ్మకాల సంత జరుగుతుంది. పొట్టేళ్లు, మేకలు అవసరమైన ఆత్మకూరు పట్టణంతో పాటు వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. రెండు వారాలుగా ఆత్మకూరు సంత మార్కెట్ లో వీటి ధరలు గణనీయంగా తగ్గాయి. 25 నుంచి 30 కిలోల పొట్టేలు కేవలం రూ.15వేల నుంచి రూ.16 వేల లోపు మాత్రమే పలుకుతున్నాయి. 15 నుంచి 20 కిలో మాంసం లభించే పొట్టేళ్లు రూ.7 నుంచి 10 వేల లోపు మాత్రమే ధర పలికాయి. ఇలా పొట్టేళ్లు , మేకల ధరలు భారీగా తగ్గినప్పటికీ స్థానికంగా వీటి మాసం విక్రయించే వారు మాత్రం ధరలు తగ్గించలేదు. ప్రస్తుతం ఆత్మకూరులో కేజీ మటన్ రూ.750 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

వర్షాకాలం వచ్చినా చికెన్ ధరలు పెంచుతున్నారు



చికెన్ ధరలు అమాంతం పెరిగాయి. వేసవికాలం పూర్తి అయ్యి, వర్షాలు ప్రారంభమవుతున్నా ధరలు తగ్గించాల్సింది పోయి పెంచుతూపోతున్నారు. వేసవిలో ఎండలకు కోళ్లు చనిపోతాయని ధరలు పెంచారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నప్పటికీ మరింత పెంచేశారు. పక్క మండలాల్లో తక్కువగానే ఉన్నాయి. ఆత్మకూరులోనే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి చికెన్ ధరలు అదుపులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణారెడ్డి, ఆత్మకూరు

భారీగా పెరిగిన మాంసం ధరలు



గత నెలలో చికెన్ ధరలు తగ్గినప్పటికీ ప్రస్తుతం పెళ్లిళ్లు, పర్వదినాలంటూ ఆత్మకూరులో చికెన్ ధరలను భారీగా పెంచారు. చికెన్ ధరలు రూ.300కు పెంచారు. మటన్ రూ.750 నుంచి రూ.800 వరకు అమ్ముతున్నారు. ఇలా మటన్, చికెన్ ధరలు పెరగడంతో పావుకిలో అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

–వెంకటేశ్వర్లు, ఆత్మకూరు

వివాహితపై కర్రతో దాడి

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన రంగస్వామి తనపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కర్రతో దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన దుగ్గాని మణి అనే మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మణి నంద్యాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో రంగస్వామి కర్రతో దాడి చేశాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలుడు

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో నాలుగేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. సంగమేశ్వరం కాలనీకి చెందిన సిరిగిరి పెద్దబాబు కుమారుడు చంద్ శనివారం ఇంటి ముంగిట పిల్లలతో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసింది. మిగతా పిల్లలు పారిపోగా చంద్ కిందపడిపోయాడు. బాలుడి వీపు, తలపై కుక్క రక్కి గాయాలు చేసింది. చుట్టుపక్కల వారు గమనించి కుక్కను తరిమేసి బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అధికారులు చొరవ చూపి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు.

మాన్యం భూముల వేలంలో తగ్గిన ఆదాయం

జూపాడుబంగ్లా: తరిగోపుల గ్రామంలోని అనంత నాగేశ్వర, వీరభద్ర, సిద్ధేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయస్వామి వార్ల దేవస్థానాలకు చెందిన మాన్యం భూములకు వేలం పాటలు నిర్వహించగా గతేడాది కంటే ఆదాయం తగ్గినట్లు ఈఓ వెంకటరమణ తెలిపారు. శనివారం గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో దేవస్థానాలకు చెందిన మాన్యం భూముల వేలం పాటలు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి రామలింగారెడ్డి, ఈఓ అధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థానాలకు సంబంధించి 110.42 ఎకరాల మాన్యం భూములుండగా అందులో 21.98 ఎకరాల భూమిలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు మొలవడంతో నిరుపయోగంగా మారాయి. మిగిలిన 88.44 ఎకరాల భూములకు వేలం పాటలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 31 మంది రైతులు రూ.2వేల చొప్పున ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొని మాన్యం భూములను ఏడాది పాటు కౌలుకు దక్కించుకున్నారు. వేలం పాటల్లో దేవదాయశాఖకు రూ.5,41,500ల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.65,500లు తక్కువగా ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ చైర్మన్ చిన్నకృష్ణారెడ్డి, అర్చకులు శివనాగయ్య, రామచంద్రయ్య, దేవదాయశాఖ సిబ్బంది నారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



వేలం పాటలను నిర్వహిస్తున్న దేవదాయశాఖ ఈఓ ఏడి.వెంకటరమణ

భూముల కౌలు వేలాలకు విశేష స్పందన

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని సంత జూటూరు, లింగాపురం గ్రామాల్లోని దేవస్థానాలకు చెందిన భూముల కౌలు వేలాలకు విశేష స్పందన లభించింది. ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో సంత జూటూరులోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 46.96 ఎకరాల భూమి కౌలుకు వేలం నిర్వహించగా రూ. 6.60లక్షలు వచ్చిందన్నారు. గతేడాది రూ. 5లక్షలు వచ్చినట్లు తెలిపారు. దీంతో పాటు లింగాపురంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 3.04 ఎకరాలకు కౌలుకు వేలాల్లో గతేడాది రూ. 10,100 రాగా ప్రస్తుతం రూ. 12వేలు వచ్చిందన్నారు. గతంలో కంటే ఈ ఏడాది అదనంగా ఆదాయాలు సమకూరినట్లు వెల్లడించారు.

బొల్లవరంలో పోటాపోటీగా వేలాలు

మహానంది మండలం బొల్లవరంలోని శ్రీ ఈశ్వర, చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన సుమారు 80 ఎకరాల భూముల కౌలుకు సంబంధించి శనివారం ఈఓ స్వర్ణముఖి ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలాలు చేపట్టారు. గతేడాది రూ. 6, 97, 500 రాగా ఈ ఏడాది రూ. 9,24,500 పలికినట్లు ఈఓ తెలిపారు. దీంతో గతంలో కంటే ఈ ఏడాది రూ. 2.27లక్షలు అదనపు ఆదాయం సమకూరినట్లు వివరించారు.

'బడిబాట' విజయవంతానికి కృషి చేయాలి



విద్యార్థుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్న డీఈఓ సుధాకర్ రెడ్డి

నందికొట్కూరు: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. పట్టణంలోని బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కోట)ను బడిబాటలో భాగంగా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించి నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో పాక్షికంగా నిర్మించాల్సిన ప్రహరీ గురించి, మధ్యాహ్న భోజన నిర్వహణ గురించి వాకబు చేశారు. అనంతరం మూడో తరగతిలో చేరడానికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అడ్మిషన్ చేసుకుని ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వారికి వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో సమకూరుతున్న సౌకర్యాలను గురించి వారికి క్షుణ్ణంగా వివరించారు.

విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలి

పాఠశాల ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశం నిర్వహించారు. 'బడి బాట' కార్యక్రమం ఈ నెలాఖరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నందున విద్యార్థులు పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రత్యేక్షంగా విద్యార్థుల గృహాలను దర్శించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు పంపేవిధంగా చూడాలని సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సలీం బాషా, ఉపాధ్యాయినులు సాలమ్మ, అరుణ, విజయ భారతి, లలితమ్మ, సరోజినీ దేవి, శంషాద్ బేగం, ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో జీవితం అస్తవ్యస్తం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ

కొత్తపల్లి: బాల్యవివాహాలు చేయడంతో బాలికల జీవితం అస్తవ్యస్తం అవుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని సింగరాజు పల్లె మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ బడిబాట, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలకి పెళ్లి వయసు వచ్చేవరకు పెళ్లి చేయకూడదన్నారు. కనీసం 18 సంవత్సరాలు వయస్సు పూర్తి కాకుండా పెళ్లి చేయడం చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. పిల్లలు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలుగా పరిగణించారని, తల్లిదండ్రులు ఈ విషయం గమనించి ఆడపిల్లలకి వివాహం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి మూడు సంవత్సరాల పూర్తయిన పిల్లలని పంపాలని సూచించారు. కార్యక్రమానికి ఎంఎస్‌కే వరజ్యోతిలక్ష్మి, ఏఎన్‌ఎం ఉమామహేశ్వరి, ఎంపీహెచ్‌ఈఓ చంద్రశేఖర్, ఆశవర్కర్ రవణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు హరిత, అంకమ్మ, ధనలక్ష్మి, నానమ్మ, మల్లేశ్వరి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాలి



అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మిని సత్కరిస్తున్న ఈఓ, ప్రొఫెసర్లు

మహానంది: తాము పడిన కష్టాలు పిల్లలు పడొద్దని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి ఆకాంక్షను నెరవేర్చాలని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం రాత్రి హాస్టల్ డే నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలానికి అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా నూతన వంగడాలపై దృష్టి సారించాలని సూచించారు. వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, రిటైర్డ్ ఏడీ నరసింహరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పండరీ భాగవత ప్రవచనాలు



డాక్టర్ టీవీ హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణ దేవస్థానంలో డాక్టర్ టీవీ హయగ్రీవాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండరీ భాగవత ప్రవచనాలు శనివారం ముగిశాయి. ఆయన పండరీనాథుడి వైశిష్టం గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహకులు అయిన గోపాలయ్య, రామ్మూర్తి..కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్, ఈఓలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీలకు మహానందీశ్వరుడి ప్రసాదాలు

మహానంది: నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ముస్లిం మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫారూఖ్‌లకు శనివారం మహానందీశ్వరుడి ప్రసాదాలు అందించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో నంద్యాలలో వారిని కలిసి స్వామి, అమ్మవారి జ్ఞాపిక అందించి ప్రసాదాలు ఇచ్చారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో ఈనెల 16 నుంచి నుండి 22వ తేదీ వరకు శ్రీ జ్ఞానప్రసాద్ గురూజీ ప్రవచనాలు వినిపిస్తారని నిర్వాహకులు తిమ్మయ్య, రామకృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ప్రవచనాలు 16వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు సప్తాః జ్ఞాన యజ్ఞం ప్రచవనాలను వినిపిస్తారని, అలాగే 22వ తేదీ సాయంత్రం వరకు ప్రచనాలు వినిపిస్తారని చెప్పారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోండి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి



పాల్గొన్న పోలీసులు, న్యాయవాదులు

నందికొట్కూరు: రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఇందిర ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి దివ్య సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసు సిబ్బంది, న్యాయవాదులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కోర్టు పరిగణలోకి వచ్చిన కేసులకు చెందిన బాధితులు లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో వాటిని పరిష్కారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 29న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందికొట్కూరు సీఐ ప్రకాశ్‌కుమార్, ఎస్‌ఐ రమణ, ఆయా మండలాల ఎస్‌లు, పోలీసులు, సినియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం



అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం ఆలయంలో అష్టబంధన బాలలయ మహా సంప్రోక్షణ శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలో వెలిసిన శ్రీ ప్రహ్లాదవరదస్వామి దేవాలయంలో జూలై 3 నుంచి 7వ తేదీ వరకు జీర్ణోద్ధరణ అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం నుంచి ఆదివారం వరకు బాలలయ కళావర్షణం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మూలమూర్తి దర్శనం ఉండదు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకోవాలి. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణములోని యాగశాలలో కొలువుంచి నవకళశ స్థాపన, పంచామృతాలతో అభిషేకించి పట్టువస్త్రాలతో అలకరించి కొలువుంచారు. అనంతరం అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం జరిపించారు.

● తాగునీరు వృథా



పైపు నుంచి లీకవుతున్న నీరు

పాములపాడు: మండల కేంద్రంలోని కేసీ కెనాల్ వంతెనపై గ్రామానికి నీటి సరఫరా చేసే పైపులైన్ లీకేజీతో కావడంతో తాగునీరు వృథా అవుతోంది. పైపులైన్‌కు మరమ్మతులు చేయక పోవడం వల్ల నీరు వృథా కావడంతో పాటు ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఈ బ్రిడ్జి మీదుగానే మిట్టకందాల గ్రామానికి, స్థానిక ఏపీ మోడల్ స్కూలు, కేజీబీవీ విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళిత కాలనీ వాసులు వెళ్లాల్సి ఉంది. బ్రిడ్జి చిత్తడిగా ఉండడంతో వారందరికి సమస్యగా మారింది. పంచాయతీ అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని, నీటిని వృథాకాకుండా, బాటసారులకు ఇబ్బంది లేకుండా వెంటనే పైపు లైన్ మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కేసీలో గుర్రపుడెక్క

పగిడ్యాల: సుంకేసుల రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరడంతో రెండు నెలలుగా ఒట్టిపోయిన కేసీ కాలువకు నీటిపారుదల శాఖ అధికారులు వెయ్యి క్యూసెక్కుల నీటిని పశువుల దాహార్తి కోసం విడుదల చేశారు. అయితే ముచ్చుమర్రి గ్రామం వద్ద కేసీలోని క్రాస్ రెగ్యులేటర్‌లను మూయడం వల్ల ఎగువ నుంచి కొట్టుకువచ్చిన గుర్రపు డెక్క 200 మీటర్ల మేరకు పేరుకుపోయింది. క్రాస్ రెగ్యులేటర్‌ల వద్ద నిలిచిన గుర్రపు డెక్క ప్రమాదకరంగా ఉంది.



కేసీలో కనువిందు చేస్తు విస్తరించిన గుర్రపు డెక్క